ముస్తాబైన శైవక్షేత్రాలు



సిద్ధలయ్య కోసలో శివుని విగ్రహం

- సిద్ధలయ్య కోనలో ప్రత్యేక ఏర్పాట్లు
- నేడు మహాశివరాత్రి

సైదాపురం: పచ్చని ప్రకృతి రమణీయత..మనసు దోచే రమ్యమైన దొరువులు..కనువిందుచేసే ఎత్తైనా కొండలు..ఇక్కడ ప్రతిచెట్టూ పుట్ట, కొండా కోన అన్నీ స్వామి స్వరూపాలే. ఎన్నో జీవ వైవిద్యానికి నెలవుగా ఉన్న ఒక అద్భుత ఓషధ క్షేత్రమే శ్రీసిద్ధలయ్య క్షేత్రం. మహాశివరాత్రి సందర్భంగా కోనలో ప్రత్యేక పూజలతో అలరాలుతోంది. ఆ దివ్య క్షేత్రమైన శ్రీసిద్ధలయ్య కోనను కనులారా వీక్షిద్దాం.

సైదాపురానికి 3కిలోమీటర్ల దూరంలో వాయువ్య దిశలో ప్రకృతి సిద్ధమైన వాతావరణంలో శ్రీసిద్ధలయ్యకోన వెలసి ఉంది. దైవాంశ సంభూతులైన ఇద్దరు యోగీశ్వర్లు శ్రీనవకోటి సిద్ధలయ్య, నవనాధు సిద్ధలయ్యతోపాటు వారి ప్రియ శిష్యులైన సారంగధరుడు స్వయంభువులుగా వెలసి ఉన్నారు. సిద్ధలయ్యకోన అంటే భక్తాదులకు ముందుగా గుర్తుకొచ్చేది మహాశివరాత్రి. బుధవారం జరిగే శివరాత్రి వేడుకల్లో భాగంగా స్వామివారికి ఉదయమే ప్రత్యేకపూజలు నిర్వహించనున్నారు. ఈఏడాది బుధవారం రాత్రి ఏడు గంటలకు అత్యంత వైభవంగా కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు మునేశ్వర్లు చెప్పారు. అలాగే సైదాపురంలోని బాలత్రిపురసుందరీదేవి ఆలయంలో కూడా స్వామి వారి కల్యాణంను నిర్వహిస్తున్నారు.



సిద్ధలయ్య స్వామి ఆలయానికి వెళ్లే మార్గం

రాపూరు మండలంలో..

రాపూరు: మండలంలో బుధవారం శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. రాపూరులోని పురాతన రామనాథేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం, శివ పార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. అలాగే ఆకలివలస సమీపంలోని బుగ్గేశ్వర స్వామి దేవస్థానంలో, సిద్ధిలేశ్వరకోన, మామిడికోనలోని ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు.

ఓజిలి: మండలంలోని భట్లకనుపూరు, ఓజిలి, ఇనుగుంట, నెమళ్లపూడి, సగుటూరు గ్రామాల్లోని శివాలయాలు మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. బుధవారం ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

చిట్టమూరులో..

చిట్టమూరు: యాకసిరి గ్రామంలో తెప్పపై వెలసియున్న గౌరీ సమేత భూపతీశ్వరస్వామి ఆలయం, గునపాడు గ్రామంలోని నాగేశ్వరస్వామి, చిట్టమూరు గ్రామంలోని శివాలయం, మల్లాం గ్రామంలోని కామాక్షీదేవి సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో వేడుకలు నిర్వహించనున్నారు. యాకసిరి తెప్పపై మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సూళ్లూరుపేట రూరల్: పట్టణంలోని నాగేశ్వర స్వామి, మన్నారుపోలూరులోని సంతానేశ్వర స్వామి, కోటపోలూరులోని ఖరకంతేశ్వరస్వామి, దామానెల్లూరులోని ధవళేశ్వర స్వామి, కొరిడిలోని వన నీలాకంఠేశ్వర స్వామి ఆలయాలను మహాశివరాత్రి సందర్భంగా ముస్తాబు చేశారు. భక్తుల సౌకర్యార్థం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు.

సర్వం సిద్ధం



విశేషాలంకరణలో నీలకంఠేశ్వరాలయం

నాయుడుపేటటౌన్ : మహాశివరాత్రి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం భక్తిశ్రద్ధలతో పరమేశ్వరుని సేవించుకునేందుకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ఈ మేరకు స్వర్ణముఖి నదీ తీరాన వెలసిన ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించనున్నట్లు ధర్మకర్త గూడూరు సుధీర్‌రెడ్డి వెల్లడించారు. బ్రాహ్మణ వీధిలోని అన్నపూర్ణేశ్వరీ దేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో రెండు రోజుల పాటు విశేష కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ ఈఓ రవికృష్ణ తెలిపారు. అలాగే అఖిలాండేశ్వరీ దేవి సమేత జంబుకేశ్వరస్వామి ఆలయం, పుదూరు హనుమదీశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు చేపట్టనున్నారు. తుమ్మూరులో టీటీడీ అనుబంధ ఆలయమైన గంగ, కామాక్షి సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో రాత్రి రావణవాహన సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఇన్‌స్పెక్టర్లు సుధీర్, హరిరెడ్డి పాల్గొన్నారు.



ఏర్పాటు చేసిన శివలింగాలు



విద్యుద్దీపాలంకరణలో రాపూరు శివాలయం



మన్నారుపోలూరులో ముస్తాబైన సంతానేశ్వర ఆలయం

మల్లికార్జునస్వామి ఆలయంలో మహారుద్రాభిషేకం

చిల్లకూరు: మహాశివరాత్రిని పురస్కరించుకుని తూర్పుకనుపూరులోని కామాక్షి సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో బుధవారం శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించి మహారుద్రాభిషేకం చేస్తున్నట్లు ముత్యాలమ్మ ఆలయ ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ తెలిపారు. తూర్పుకనుపూరులోని మల్లికార్జునస్వామి ఆలయంలో ముత్యాలమ్మ ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ యరటపల్లి జానకిరామిరెడ్డి, స్వామి కళ్యాణ ఉభయకర్త ఒబ్బాయి శివకుమార్ మహాశివరాత్రి ఏర్పాట్లపై మంగళవారం ఆలయం వద్ద సమీక్ష నిర్వహించారు.

రుణాల కోసం ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

కలువాయి: మండలంలో బీసీ, ఈబీసీ, కాపు రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. రుణాల కోసం 408 మంది దరఖాస్తు చేసుకోగా 265 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. దరఖాస్తుదారుల అర్హత సర్టిఫికెట్లు, ధ్రువీకరణ పత్రాలను అధికారులు పరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ భవాని, కలువాయి ఎస్‌బీఐ, ఏపీజీబీ, కుల్లూరు ఏపీజీబీ, ఆదూరుపల్లి కెనరా బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

వెంకటగిరి రూరల్: ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు రూ.2,500 గిట్టుబాటు ధర కల్పించాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జీ.సునీత డిమాండ్ చేశారు. రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అంతకముందు ఆర్టీసీ బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రాంబాబుకు వినతి పత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ గత ఏడాది వరి బస్తా రూ.2,300కు విక్రయించారని, కానీ ఈ యేడు రూ.1,650కు పడిపోయిందని వాపోయారు. రైతుకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్.సుబ్బరాయుడు, సభ్యులు వీవీ.రమణయ్య, నాయకులు జీ.తిరుపాల్, భాస్కర్, పారి పెంచలయ్య, స్త్రీవిముక్తి ఘటన నాయకులు సీహెచ్ రూన్సీ, చిన ఓబయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళలకు ఆర్థిక భరోసా



శిక్షణ తీసుకున్న మహిళలు

చిల్లకూరు: ఇంటి నుంచే మహిళలకు ఆర్థికంగా భరోసా కల్పించేలా సునీతా సేవా సంస్థ కృషి చేస్తుందని సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మీ అన్నారు. గూడూరు పట్టణంలోని సంస్థ కార్యాలయంలో గత 30 రోజులు పాటు నిర్వహించిన బ్యూటీషియన్ కోర్సు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కోర్సును 30 మంది యువతులు నేర్చుకున్నారన్నారు. సంస్థ ఉపాధ్యక్షురాలు, ఉమాదేవి, శిక్షకులు రూప, గిరిజ పాల్గొన్నారు.

కలుపు నివారించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సైదాపురం: రైతులు కలుపు మొక్కలను నివారించుకోవాలని ఏఓ హైమావతి సూచించారు. మండలంలోని పాలూరు, అనంతమడుగు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.

ఇళ్లు నిర్మించుకుంటే అదనపు నిధులు



రికార్డులు పరిశీలిస్తున్న పీడీ

కలువాయి: ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా ఇళ్ల ఎస్టీ, ఎస్సీ, చేనేత లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా నిధులు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుందని నెల్లూరు జిల్లా హౌసింగ్ పీడీ వేణుగోపాల్ తెలిపారు. కలువాయి మండలంలో ఆయన మంగళవారం పర్యటించారు. కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పక్కా ఇంటి యూనిట్ విలువ రూ.1.80 లక్షలు ఉందని, ఇంటి నిర్మాణానికి మొత్తం సరిపోక పలువురు లబ్ధిదారులు ఇళ్లు పూర్తిచేసుకోలేక పోతున్నారన్న విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లిందని తెలిపారు. ఎస్టీ లబ్ధిదారులకు అదనంగా మరో రూ.75 వేలు, ఎస్సీ, చేనేత లబ్ధిదారులకు రూ.50 వేలు అదనంగా నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, జీఓ రావల్సి ఉందని అన్నారు. హౌసింగ్ ఏఈ అక్మల్ ఉన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం



ఎంఈఓను సత్కరిస్తున్న నిర్వాహకులు

నాయుడుపేటటౌన్: విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు విలువలతో కూడిన విద్య అవసరమని ఎంఈఓ మునిరత్నం తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో నిర్వహించిన విద్యా కేంద్రం వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంఈఓను పాఠశాల ప్రిన్సిపల్ రామిరెడ్డి, శ్రీవేమ విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, గిరిరెడ్డి ఘనంగా సత్కరించారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి



నమోదును పరిశీలిస్తున్న ఏఓ విజయలక్ష్మి

ఓజిలి: ప్రభుత్వ పథకాలు పొందాలంటే రైతులు విశిష్ట సంఖ్యను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏఓ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం మండలంలోని భట్లకనుపూరు రైతుసేవా కేంద్రంలో ఈ మేరకు అన్నదాతలకు అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం నుంచి ఆన్‌లైన్ ద్వారా విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవచ్చని వెల్లడించారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు.

కండలేరులో 52.188 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 52.188 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 620, పిన్నెరు కాలువకు 120, లోలెవల్ కాలువకు 210, హైలెవల్ కాలువకు 210, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈసందర్భంగా ఆయన పేర్కొన్నారు.

నాసిరకంగా పనులు



వృథాగా పోతున్న తాగునీటిని పరిశీలిస్తున్న డీఈఈ

–విచారణ చేపట్టిన ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ

చిట్టమూరు: తాగునీటి ఇబ్బందులు తొలగించి పేదలకు గుక్కెడు మంచి నీటిని అందించాల్సిన గ్రామ ప్రజాప్రతినిధి భర్త తన చేతి వాటం ప్రదర్శిస్తూ మంజూరైన నిధులను పూర్తిగా వినియోగించకుండా నాసిరకంగా పనులు చేసి నిధులు బొక్కేసిన సంఘటన చిట్టమూరు మండలం ఆరూరు పంచాయతీలో చోటుచేసుకుంది. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ నందకుమార్ మంగళవారం గ్రామంలో విచారణ చేపట్టారు. వివరాల మేరకు.. ఆరూరు పంచాయతీలోని రాఘవవారిపాళెంలో గ్రామస్తుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు గత ప్రభుత్వం రూ.1.75 లక్షల నిధులు మంజూరు చేసింది. ఎన్నికల రావడంతో పనులు ఎన్నికల అనంతరం పూర్తి చేశారు. ఈక్రమంలో పైప్‌లైన్‌ను ఆరూరు నుంచి రాఘవవారిపాళెం వరకు కి.మీ దూరం పైప్‌లైన్ పనులు దక్కించుకున్న అధికార పార్టీకి చెందిన సర్పంచ్ భర్త పాత పైపులు వేసి చేతులు దులుపుకున్నాడు. దీంతో పైప్‌లైన్ వేసినప్పటికీ గ్రామస్తులకు తాగునీరు అందకపోవడం, వదలిన రోజున ఏదో ఒక ప్రాంతంలో పైప్‌లైన్లు పగిలి పోవడం జరుగుతోంది. దీంతో గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో డీఈఈ నందకుమార్ గ్రామానికి చేరుకుని గ్రామస్తులను విచారించారు. అనంతరం పైప్‌లైన్ పగిలి పోయి ఉన్న ప్రాంతాలను పరిశీలించి వాటిని తవ్వించేందుకు సిద్ధం కాగా సర్పంచ్ భర్త తాను అందుబాటులో లేనని గురువారం వచ్చిన తరువాత తవ్వి చూపిస్తామని చెప్పడం గమనార్హం దీంతో అధికారులు వెనుదిరిగారు. ఆయన వెంట ఏఈ మహేష్ ఉన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రశ్న పత్రాలు



ప్రశ్నపత్రాల బాక్సులను పరిశీలిస్తున్న అధికారులు



రాపూరు పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు

నాయుడుపేటటౌన్ : ఇంటర్ ప్రశ్నపత్రాలు మంగళవారం నాయుడుపేట పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. ప్రత్యేక వాహనంలో వచ్చిన ప్రశ్న పత్రాలను స్థానిక కస్టోడియన్ అధికారి మోహన్‌రావుకు అందించారు. ఆయన మాట్లాడుతూ మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పట్టణంలోని పెసల గుర్రప్పశెట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలుర గురుకుల కళాశాల, శ్రీవేమ జూనియర్ కాలేజీల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు 1,200 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వివరించారు. ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్‌లోని స్ట్రాంగ్‌రూమ్‌లో కట్టుదిట్టంగా భద్రపరచినట్లు ఆయన వెల్లడించారు.

రాపూరులో..

రాపూరు: మార్చి 1వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాలు మంగళవారం రాపూరు పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచినట్లు చీఫ్ సూపరింటెండెంట్ సాయికిరణ్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ రంజిత్ తెలిపారు. వారు మాట్లాడుతూ నెల్లూరు నుంచి ప్రత్యేక వాహనంలో రాపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అవసరమైన ప్రశ్నపత్రాలను తీసుకొచ్చి పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచినట్లు పేర్కొన్నారు.

ఆక్రమిత భూముల్లో హెచ్చరిక బోర్డు

సాక్షి ఎఫెక్ట్..

చిల్లకూరు: తీర ప్రాంతంలోని మోమిడి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 300 ఉన్న శ్మశాన భూమి 19.90 ఎకరాలలో గ్రామానికి చెందిన కూటమి నేతలు కొంతభాగం చదును చేసి అందులో సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. స్థానికుల సమాచారంతో సాక్షి మంగళవారం ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. స్పందించిన తహసీల్దార్ శ్రీనివాసులు రెవెన్యూ సిబ్బందిని ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామ వీఆర్‌ఏ ఆక్రమిత శ్మశాన భూమి వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి భూమిలో ఎవరైనా దిగితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



అంగన్‌వాడీలకు 'జ్ఞానజ్యోతి'

ఓజిలి: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం రెండో విడత జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చారు. ఎంఈఓలు శైలజ, చంద్రశేఖర్ మాట్లాడుతూ పిల్లలకు అర్థమయ్యేలా ఆటలు, పాటల రూపంలో విద్యాబోధన చేయాలని సూచించారు. ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సకాలంలో సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలని సీడీపీఓ ఉమామహేశ్వరి లిపారు. ప్రీస్కూల్స్‌పై రిసోర్స్‌పర్సన్లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజన, హెచ్‌ఎం మంజుల, డీఆర్పీలు సుజనమ్మ, శ్రీనివాసులురెడ్డి, వెంకటరమణయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓలు శైలజ, చంద్రశేఖర్

అంగన్‌వాడీల పాత్ర కీలకం

వాకాడు: ప్రీ స్కూల్ పిల్లల విద్యాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర కీలకమని వాకాడు ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. స్థానిక ఎన్‌బీకేఆర్ జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఎంపీడీఓ పాల్గొని మాట్లాడారు. ఎంఈఓ నసీం అలీ, హెచ్‌ఎం పిడుగు ప్రవీణ్‌కుమార్, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ముగిసిన శిక్షణ

నాయుడుపేటటౌన్: నాయుడుపేట, ఓజిలి, పెళ్లకూరు మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. సీడీపీఓ ఉమామహేశ్వరి మాట్లాడుతూ నూతన విద్యావిధానాలకు అనుగుణంగా పిల్లలకు వివిధ అంశాలను బోధించాలని ఆయన సూచించారు. అనంతరం శిక్షణకు హాజరైన అంగన్‌వాడీలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మునిరత్నం పాల్గొన్నారు.



జ్ఞానజ్యోతి కార్యక్రమంలో అధికారులు



అంగన్‌వాడీలతో ఎంఈఓ మునిరత్నం, సీడీపీఓ ఉమామహేశ్వరి

కబడ్డీ విజేతలకు బహుమతులు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం

చిట్టమూరు: చిట్టమూరు, ఆరూరు, అరవపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ఇంట్రామోరల్ కబడ్డీ పోటీలు నిర్వహించి విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తడ మండలం శ్రీసిటీలోని మోడలైజింగ్ కంపెనీ ఆర్థిక సాయంతో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో మూడు పాఠశాలల్లో కబడ్డీ పోటీలు నిర్వహించారు. విజయం సాధించిన అండర్ 14 విభాగంలో 120 మందికి బహుమతులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు మోడలైజింగ్ వారు ఒక కబడ్డీ కోచ్‌ను నియమించినట్లు నిర్వాహకులు తెలిపారు. సీహెచ్ చైతన్య అనే పీఈటీని నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గీతాకుమారి, ఉపాధ్యాయులు చలపతి, వెంకటేశ్వర్లు, మీరయ్య, పీఈటీలు మహీపతి, నరేంద్ర, సురేష్‌బాబు పాల్గొన్నారు.

దాహార్తి తీరేలా..!



పెళ్లకూరు మండలం అర్లపాడు ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని తాగునీటి బోర్ పాయింట్ విద్యార్థులతోపాటు గ్రామస్తుల దాహార్తిని తీరుస్తోంది. ఈ పాయింట్‌కు చేతిపంపుతోపాటు మోటారు కూడా అమర్చడంతో స్థానికంగా నీటి ఎద్దడి తలెత్తకుండా ఆదుకుంటోంది. ఓవర్‌హెడ్ ట్యాంకుకు నీరు సరఫరా చేసే మోటారు మరమ్మతులకు గురికావడంతో గ్రామస్తులకు ఈ బోరు పాయింటే నీటి వనరుగా మారింది.

– పెళ్లకూరు